"ఉంది స్వామీ." జవాబు చెప్పిందామె.

"సరే. దాంతో నువ్వు ఆ మాట చెప్పిన నీ స్నేహితురాళ్ళందరినీ కొట్టి, వాళ్ళకి దేవుడి మీద నిజమైన భక్తి కనక ఉంటే, దెబ్బలు తగలవని చెప్పు."

## 133. అహం పార్శ్వం

ఓ కప్ప, ఓ బాతు ఓ చెరువులో కలిసి జీవిస్తున్నాయి.. ఓ వేసవి వేడికి ఆ చెరువు ఎండిపోసాగింది. దాంతో కప్ప బాతుతో చెప్పింది.

"మిత్రమా! నువ్వు, ఇంకో బాతు కలిసి నోట్లో ఓ కర్ర పుల్లని పట్టుకుంటే, నేను దాన్ని నా నోటితో పట్టుకుంటాను. మనం ముగ్గురం కలిసి నీరున్న ఇంకో జలాశయానికి వెళ్ళిపోదాం."

ఆ ప్రకారం ఆ కప్ప, బాతు, బాతు మిత్రుడు కలిసి ఆకాశంలో వెళ్తుంటే ఆ దృశ్యాన్ని చూసిన ఓ రైతు ఆశ్చర్యంగా అన్నాడు.

"ఎంత గొప్ప ఆలోచన! ఇది ఆ ముగ్గురిలో ఎవరిదో కదా?"

వెంటనే కప్ప నోరు తెరచి 'అది నా ఆలోచన' అని గర్వంగా చెప్పింది. దాంతో పట్టుతప్పి నేలకూలి మరణించింది.

అహమే మనిషి కష్టాలకి మూలం అని శాస్త్రాలు చెప్తున్నాయి. అహం అంటే 'నేను ఇతరుల్లా కాదు' అన్న భావన. గర్వం అహం తాలూకు ఓ పార్శ్వం.

## 134. భక్తి-జ్ఞానం

ప్రయాగలో జరిగే ఓ కుంభమేళాకి వెళుతూ దారిలో ఓ జ్ఞాని, ఓ భక్తుడు కలుసుకున్నారు.

"నాకు శ్రీకృష్ణుడి పాదాలు పట్టుకోవడం తప్ప ఇంకేం తెలీదు." చెప్పాడు భక్తుడు.

"భక్తి ఒక్కటి సరిపోదు. ముక్తికి జ్ఞానం ముఖ్యం." చెప్పాడు జ్ఞాని.